అంటరానిబాలిక

కె సుకుర్తి రామకోటయ్యా చౌదరిగారు

రూప నిజముగా రూపఖని. బంగారమువంటిరంగు, సుందరమైనముఖము, పెద్దపెద్దనేత్రములు. ఆమెను సుందరీమణులలో నొకశ్రేష్ఠస్థాన మివ్వవచ్చు. కాని ఆమె అంటరానిబాలిక. ఇందువల్లనే ఆమె సౌందర్యము వృథా. కోకిలనుధిక్కరించు ఆమె మధురవాణి ఎవనికిప్రియముగా నుండదు? కాని ఎవరూ వినువారులేరు. ఆమె మనోహరమందగమనమును కాముకులును, లంపటులునూ తప్ప చూచువారెవ్వరూలేరు. ఆమె చంచల దృక్కులు చాలామందిహృదయములలో ప్రేమకు మారుగా నొప్పినిగలుగజేయును. ఎందువల్ల?...ఆమె అంటరానిబాలిక.

ఆమె అంటరానిది. ఇదే ఆమెదోషము. ఇందువల్లనే ఆమెను దగ్గిరకూర్చోనివ్వరు. ఎవరునూ ఆదరించరు, సహానుభూతిగా రెండుమాటలైననూ మాట్లాడరు. ఆమెనుజూచి పురుషులు “ఆహా! యీమె మంచికులములో జన్మించినట్లయితే” అనుకునేవారు స్త్రీలు. “ఈమె అంటరాని బాలికకానట్లయితే” అనుకునేవారు. కాని నేను ఎప్పుడూ యిట్లనుకోను. ఈమె ఏదైనామంచికులములో జన్మించియున్నట్లయితే ఎంతో అభిమానముతోఉండేది. ఇప్పుడందులో శతాంశమైననూలేదు. పెద్దకులమున జన్మించుచో ఆమె సహజ సౌందర్యము బాహ్యభూషణములతో కప్పబడిపొయ్యేది. ఆమెయందు లజ్జ, పవిత్రత, సచ్చరిత్రత మూర్తీభవించియున్నవి. ఆమె ఎప్పుడూ ఎవరితోనూ పరిహాసమాడదు. ఎవరితోనూ మాటలాడదు. ఆమె యిటునటు బోవుచుండునప్పుడు, అనేకమంది ఆమెనుగురించి రకరకములుగా మాట్లాడుకొనెదరు. కాని ఆమె నిశ్శబ్దంగా వెళ్ళిపోతుంది. వంచినతల పైకెత్తదు.

ఆమె నాయింటికితప్ప మరెవ్వరింటికిపోదు. పోయిననూ పిలిచినప్పుడు మాత్రమే. ఆమె ఆత్మగౌరవము గలది. అయిననూ అంటరానిది. ఆమె నిత్యము మాయింటికివచ్చుచూఉండును. మాఅమ్మ, పినతల్లుల స్వభావమంత మంచిదిగాదు. అయిననూ మాయింట్లో తనఅభిమానమంతయూ మరచిపోతుంది. వస్తూపోతూనావంక ఒకసారిమాత్రము తప్పకుండా చూచిపోతుంది. మారెండుచూపులు కలవటంతోనే సిగ్గుతోపారిపోతుంది. నేను ముంగిలిలో కాన్పించినచో లోపలకువస్తుంది. ఆమె హృదయంలో ఏముందో ఈశ్వరునికి తెలియాలి. కాని నన్నుజూచి మాత్రము ప్రసన్నముఖియవుతుంది.

ఆమెనుగురించి నామనస్సు ఎల్లప్పుడూ పవిత్రతగాఉంటుంది. నేనామెనుజూచి ప్రసన్నుడనౌతాను. కాని ఏదో తప్పుఅభిప్రాయంతో మాత్రంగాదు. నేనామెను అంటరానిదని దూరముగాఉంచను. ఆమె దరిద్రత జూచినప్పుడు దుఃఖమును, ఆత్మాభిమానము జూచినప్పుడు గర్వమును గలుగుతూయుంటుంది. ఇతరులు ఆమెతో నీచముగా ప్రవర్తించునప్పుడు నాహృదయము క్రోధముచే నిండిపోతుంది. కాని రూప వారికువాసనలపై కుఠారాఘాతముచేయుటజూచి సంతోషముతో ఉబ్బిపోతాను. నాకు రూపమీద ఎంతోగర్వము.

అప్పుడప్పుడు రూపతో ఒకటిరెండుమాటలు మాట్లాడుతాను. ఆమె యింతమాత్రముచేతనే సంతుష్టిచెందుతుంది. నేనెప్పుడైనా ఆమెకు పనిజెప్పినచో సంతోషముతో తక్షణమేపరుగెత్తి నాపనిపూర్తిజేస్తుంది. అప్పుడప్పుడామెకు సహాయముచెయ్యాలనుకుంటాను, కాని ఆమె ఎప్పుడూ నావల్లనొక్కపైసా కూడా తీసుకోలే. ఇందువల్ల నాకప్పుడప్పుడు దుఃఖముగలుగుతూఉంటుంది. మాఅమ్మఏదైనా యిచ్చినచో ఎంతోసంతోషముతో తీసుకుంటుంది. ఇందువల్ల నాకు మరీదుఃఖము. నాతల్లిని, పినతల్లినిచూస్తే చాలాభయంగానేయుంటుంది. ఎప్పుడూ గడపలోపలకు అడుగుపెట్టదు. పెట్టిననూ ఏవస్తువయూ ముట్టుకోదు.

ఒకపర్యాయము ఆమె ఇల్లూడ్చునప్పుడు అకస్మాత్తుగా ఆమెవస్త్రము పాత్రలకుతగిలింది. పాత్రల కానుకునే నీటికడవలున్నవి. నాతల్లి చూడడంతోనే క్రోధముతో అరచుచూ ఒకకట్టె తీసుకుని విసరివేసింది. కట్టె ఆమెకోమలమయిన కాళ్ళకుతగిలింది. వెంటనే నెత్తురువచ్చింది. కాని రూపనోటినుండి ఒకశబ్దముగూడా వెలువడలే. నిశ్శబ్దంగానుంచుంది. ఆమెముఖము మలినమయింది. కళ్లనిండానీళ్ళు గిర్రునతిరిగినవి. నాతల్లి కోపము ఇంకాశాంతించలే. "నీకళ్ళుపోయినవా? చూడడంలే? కడవలు, పాత్రలు అన్నియు మైలబడి పోయినవే?"అంది.

మాపినతల్లి "అందగత్తెననే గర్వంతో తనెవరో మరచిపోయింది"అంది. నాతల్లి "యిటువంటి అందానికినిప్పొయ్య! ఫో, పాడుముఖముదానా! నాయింటినుంచి"అంది.

పాపము రూప గడగడలాడుతూ వెళ్ళిపోయింది. నేను బయటిగదిలోకూర్చుని చదువుకుంటూ యున్నాను. ఆమె కాలిరక్తముజూచి "రూపా! యిది ఏమిటి?"అన్నాను.

"బాబూ! అమ్మగారుకొట్టింది." రూప నాతో ఏమియూదాపెట్టదు. నాకు కోపమొచ్చింది. "ఎందుకు?" అన్నాను.

"నావల్ల నీళ్ళకడవలు మైలబడ్డవి"

నాహృదయము క్షుభించిపోయింది. ఈతప్పునకే యింతశిక్ష? ఈమె మనిషికాదా? బీదదనా? ఈమె తరఫున ఎవరును మాట్లాడువారులేరనియా? హా! మానుషత్వము! నేను మరల "రూపా! నాయీతల్లి తప్పు క్షమించవలయును"అన్నాను.

రూప:—రామ! రామ! బాబూ! తమరట్లాఅనెదరేమి? వారు నాతల్లితోసమానము. తల్లితనబిడ్డను ఎప్పుడూ కొట్టుకోనదా?

నేను:—ఇతరు లేమందురు?

రూప:—ఇతరులకెట్లా తెలుస్తుంది?

ఈమాటచెప్పి ఆమె వెళ్ళిపోయింది. నాకళ్ళనుండి రెండు కన్నీటిబిందువులు పుస్తకంపైబడ్డవి. హృదయము వేదనతో "ఇదేనా అంటు?"అంది.

మాఅమ్మకడవలన్నియు పారవేశింది. పాత్రలన్నియు నిప్పులోవేసి పవిత్రంజేసింది. మాతల్లితో "అమ్మా! రూప అంటుకున్నందువల్ల పాత్రలుగూడా మైలపడ్డవా?"అన్నాను.

మాతల్లికోపంతో "పో! పో! నీకంటులేదు గాబోలు. నాకంటుంది"అంది. నేను బయటికు వెళ్ళి పోయ్యాను. నాహృదయంలోఉన్నఅగ్ని నాశరీరమంతటిని కాల్చివేయుచున్నది. నాఅశ్రుధారగూడా నాహృదయాగ్నిని చల్లార్పలేకపోయింది. రూప రెండవదినమున ఎప్పటివలె నాగదిముందుగాబోతుంది. ఆమెకాలికి కట్టుకట్టుకుంది. కొంచెంగాకుంటుతుంది కూడాను. కుంటటంనాకు కాన్పించకుండాజెయ్యాలని చాలాప్రయత్నించింది. కాని లాభంలేకపోయింది. ఆమె నావంకజూచి చిరునవ్వునవ్వింది. దెబ్బతినియూ, ఎక్కువదుఃఖము అనుభవించియుగూడా తనదుఃఖమును నాతో దాచిపెట్టవలయుననియే ప్రయత్నించింది. ఎటువంటి సహనశీలత?...ఎంతఓర్పు?...

ఈరోజులలో ఆమెతండ్రి జబ్బుతో మంచముపైబడియున్నాడు. చలిజ్వర మతనిని శల్యావశిష్టుణ్ని జేసింది. కఠినపరిశ్రమజేసి రోజుకూలి సంపాదించుకుని పొట్టగడుపుకొనువారలు నాల్గురోజులు మంచముపై బడియున్నచో వాళ్ళగతిఏమవుతుందో అనుభవించువారలకుతప్ప మనం గ్రహించడం కష్టమేయవుతుంది. నాల్గయిదురోజులవరకూ ఏదోవిధంగా గడచిపోయింది. కాని యిక ఉపవాసములు చేయవలసివచ్చింది.

హీంగూయొక్క జబ్బు, దరిద్రత, వానికష్టములు అందరికి తెలిసియేయుంది. అయిననూ ఎవరూ వానిఇంటికివెళ్ళి మాట్లాడించలే. నేనుతప్పకుండా రోజుకురెండుమార్లు వెళ్ళుతూయుంటాను. మందు యేర్పాటంతయూజేశాను. పాపము రూప ఎవరినన్నా అడిగి మందుతెచ్చుటకుగూడా సిగ్గుపడుతుంది.

నాయీవ్యవహారమువల్ల రూపపైననూ ఆమెతండ్రిపైనను చాలాప్రభావంపడ్డది. పాపము హీంగూ నాకు వందలకొలదీ దీవెనలిచ్చాడు. నాయీసహాయమును ఎంతోపొగడాడు. కాని రూపనోటినుండి ఒక మాటగూడా వెడలదు. ఆమె నిశ్శబ్దంగా నావంకజూచుచూఉంటుంది. అప్పుడప్పుడా మెనేత్రములనుండి కృతజ్ఞతాశ్రువులు వెలుపలికివచ్చి ఆమెసుందరమైన చెక్కిళులను తడపివేయుచూఉండును. ఆమె ఈ మూకకృతజ్ఞతవల్లనే నెంతమర్మాహతుడనయ్యేదనో అంతయీజీవితంలో ఎప్పుడూగాను. జబ్బువచ్చిన ఏడవ దినమున ఎప్పటివలె రూప యింటికివెళ్ళాను. హీంగూ ఆరోజున అచేతనుడైపడియున్నాడు. రూప తండ్రి మంచమువద్ద కూర్చునిఏడుస్తూఉంది. నన్నుజూచుటతోనే కళ్ళుతుడుచుకుని "బాబుగారూ! ఈరోజున మాతండ్రిస్థితి చాలాకష్టంగాఉంది. ఉదయాన్నుంచి తెలివేలేదు"అంది.

"రూపా! నన్నెందుకుపిలవలేదు?"అన్నాను.

రూప నేత్రములనిండా నీరునిండింది. "బాబుగారూ! నేను తల్లిగారికి భయపడుతున్నాను. గ్రామస్థు లందరూ మిమ్ములనవ్వదరేమోయనిగూడా భయంగాఉంది. నాకేమి? నేను నీచురాలను. నాకుకీర్త్యప కీర్తులులేవుగా!"అని మరల నేడ్వ నారంభించింది.

నేను నామనస్సులో "రూపా! నీవు నీచకులజవైననూ అందరికంటె ఎక్కువైనదానవు. నీయుద్దేశ ములు ఎంతపవిత్రమయినవో యితరులవి అంతనీచమైనవి. నీవుదేవివి" అనుకున్నాను. మరల ప్రత్యక్షముగా "రూపా! నీకపకీర్తివచ్చునేమోయని చూచుచున్నాను. లేనిచో దినమంతయూ ఇక్కడనేయుందును. నేను నీకపకీర్తివచ్చుట కిష్టపడను"అన్నాను.

ఈమాటవిని రూపయింకాఎక్కువగా ఏడ్వసాగింది. నేనేదోవిధంగా శాంతపరిచి, మందుతెచ్చుటకొరకై లేచివెళ్ళుతున్నాను. రూపఎదురుగా వచ్చినన్నాపి, ఒకవెండివస్తువు నాచేతిలోఉంచి "బాబుగారూ! దీనిని ఏదోవిధముగాఅమ్మి నాకుడబ్బుతెచ్చియివ్వండి. ఈరోజున ఇంట్లో ఒకగింజగూడాలేదు"అన్నది.

నాకళ్ళనిండా నీరునిండింది. కంపితస్వరముతో "రూపా! ఇది నాఆజ్ఞఅనుకో లేక ప్రార్థనఅనుకో: నేను చెప్పువరకూ నీవస్తువేదియూ అమ్మవలదు. నాకుశక్తియున్నంతవరకూ నీకు సహాయముజేసెదను. ఆపై ఈశ్వరాజ్ఞ"అన్నాను. రూపఏదో చెప్పప్రయత్నించింది. కాని నేనుమరల "నావలన నీవు ఎప్పుడూ సహా యముపొందలేదు. ఈరోజున నీవు ఒప్పుకొననిచో నాకు దుఃఖముకలుగును."అన్నాను.

రూప ఏమియుమాట్లాడలే. కేవలం నావంక చూచుచూనుంచుంది. ఆమె యుద్దేశ్యములన్నియు ఆమె కళ్ళలో ప్రతిబింబించుచున్నవి. కళ్ళయందు కృతజ్ఞత, అధరములమీద క్షీణమైనట్టియూ దుఃఖముతో గూడు కునిన చిరునవ్వు ఉంది. నేను ఆమెవస్తువులను తిరిగియిచ్చివేసి జేబులోనుండి ఐదురూప్యముల నోటుతీసి ఆమెచేతిలోఉంచాను. ఆమె ఒకనిట్టూర్పువిడచి తండ్రివద్దకూర్చుంది.

రెండువారములు గడచిపోయింది. ఆమెతండ్రిజబ్బు ఇంకాతగ్గలే. నేను ఏదోయొకటి ఇతరులు చూడ కుండా రూపకు ఇస్తూనేయున్నాను. ఇతరులుచూచినచో దీనికిగూడా ఏదోయొకఅర్థం గలిపిస్తారని నాకెంతోభయంగాఉండేది. ఒకరోజున కొందరపెద్దలను పోగుజేశాను. వారితో "చూడండీ! హీంగూ చాలారోజులనుండీ జబ్బుగాఉన్నాడు. వానికి సహాయముచెయ్యాలే. పాపము! ఆకలివల్ల చచ్చిపోవు చున్నాడు."అన్నాను.

ఒక పెద్దమనిషి:-తమ రొక్కరికే ఇంతవిచార మెందుకు?

నేనుత్తేజితుడనై “మనుష్యత్వోద్దేశముతో”అన్నాను.

కొంతమంది మెల్లగానవ్వారు. ఆనవ్వులో అవిశ్వాసముంది. “నేను ఈనీచపిశాచముల సహాయము కోరి ఆపవిత్రాత్మను కళంకితముజేశా”ననుకున్నాను.

నేనేమియు మరలమాట్లాడలే. నిశ్శబ్దంగా లేచినుంచున్నాను. నేను లేవటంజూచి ఒకవృద్ధుడు“బాబూ! మనవాళ్ళన్నా అయితే సహాయముజేతుము. ఎవరోఅంటరాని వాళ్ళకెట్లా సహాయముచేయగలము?” అన్నాడు. నేను మనస్సులో “ఆహా! పశుత్వం”అనుకున్నాను.

ఇద్దరుముగ్గురుమాత్రం నావత్తిడిపల్ల కొంచం సహాయముజేశారు. మనుష్యజాతిని అవమానపరచు ఈ నరపిశాచముల జూచినప్పుడు నాహృదయంలో ఒకవిధమయిన ఘృణాభావముగలిగింది. వీరు స్వార్థాంధులని స్పష్టంగా తెలిసిపోయింది. వీరు నీచోద్దేశులయిననూ ఉచ్చకులజులే...రూప అంటరానిది.

మూడువారములు గడచిపోయింది. హింగూ ఇప్పటివరకూ మంచముమీద నేపడియున్నాడు. ఎవరూ పలుకరించువారులేరు. ఒక పైసగూడ సహాయముజేయువారులేరు. ఒకరోజున బయటవసారాలోగూర్చుని రూప ఏడుస్తూయుంది. నన్నుచూచుటతోనే మరీఎక్కువజేసింది. ఓదార్చుచూ “రూపా! ఏమిటి? ఇంత అధీరవై పోవుచున్నావు. ఎందుకు?”అన్నాను. ఎందుకేడుస్తుందో చెప్పవలయునని చాలాబలవంతపెట్టాను. ఆఖరుకు చెప్పింది. ఆమె నొకపెద్దమనిషి అన్నానికిపిలిచాడు. ఏకాంతంగాజూచి అతినీచప్రసంగంజేశాడు. అనేక విధముల ఆశపెట్టాడు. ఆమె అతనిదురాశలన్నింటిని కాలదన్నింది....హా! దౌర్భాగ్యము!! ప్రపంచములో ఎటువంటినీచులు, కృతఘ్నులున్నారు? వారు ఇతరులదుఃఖముజూచి దుఃఖితులవుటకుమారుగా వారినే పీడించుచున్నారు. పైగా తమను ఉచ్చకులజులమని ప్రకటించుకొనుచున్నారు.

నేను దుఃఖితుడనౌటజూచి రూప “బాబుగారూ! తమరు దుఃఖించవలదు. ఇది నాపూర్వజన్మకర్మ ఫలము కానిచో ఈ అంటరానిజాతిలో నెందుకుపుట్టుగును? అంటరానివాళ్ళ కింతకంటె ఏమిసన్మానము జరుగును?”అంది.

నేను “రూపా! ఈఅవమానమునకు బదులుతీర్చకుండా యుండలేను”అన్నాను.

రూప గంభీరముతో “వలదు, బాబూ! వలదు. తమరుఎవరిని ఏమియూఅనవలదు. నాప్రార్థన అంగీకరించి ఊరుకోండి”అంది.

నేను “రూపా! నీవు దేవివి” అన్నాను.

రూప చిరునవ్వుతో “ఆహా! తమరెటువంటిమాట మాట్లాడుచున్నారు? నాయటువంటి అంటరానిది గూడా దేవియగునా? నేను దేవీపాదరేణువునుగూడా మోలను”అంది.

నేను రూపయింటికి రావటంపోవటం నెమ్మదినెమ్మదిగా అందరికితెలిసింది. అందరూ అనేకరకములుగా అనుకుంటున్నారు. ఒకడు “ఇందుకనే అయ్యగారు హింగూకుసహాయముచేయండని యింతగా గొట్టుకున్నాడు. నాకసలు మొదటనే సందేహంగలిగింది”అన్నాడు. రెండవవాడు “లేకపోతే ఏమనుకుంటున్నావు? ఆయనంతపరోపకారనుకున్నావా?” మూడవవాడు “రూప వలలోపడ్డాడు. అదిగూడా చాలాచక్కందే.” రూపతో నీచప్రసంగముజేసినవాడు “చక్కనిదైనా అంటరానిది. ఆమెను పవిత్రమైన హిందువు డెవ్వ డంటుకుంటాడు? ఇది ఆంగ్లచదువులఫలితము. చక్కగాఉంటేసరి ఎవతైనాసరే. ఇది అంటరానిదౌనా కాదాయను విచారణయేలేదు.” అన్నాడు. మరొకహిందూమతాచార్యుడు “ఇప్పుడేమయింది?

కొద్దిరోజులలో అంటరానివారితో బహిరంగంగానే వివాహము చేసుకుంటారు. ఇటువంటి నవయువకులవల్లనూ, జాతివిరోధులవల్లనూ హిందూజాతి రసాతలమునకు బోతుంది”అన్నాడు.

ఇటువంటి అనేక మైనమాటలు నాకు చేరుచున్నవి. నేను నామనస్సులో “హా...! పాషండులారా? నోటితో రాం! రాం! హృదయంలో ఇటువంటికువాసనలు, ఇటువంటికుచ్ఛితోద్దేశములు. పైగా ధర్మాత్మవలం బులమని గర్వము”అనుకున్నాను.

నాతల్లికిగూడా ఈసంగతులు తెలియకుండాయుండలే. ఆమె ఒకరోజున క్రోధముతో “ఏమిరా! జ్ఞానూ! నీవు యింతలజ్జాహీనుడవైతివా? పట్టణములో అందరూఊమియుచూఉన్నారే? ఇదేనా ఆంగ్లభాష నేర్చిన ఫలితము?”అంది.

నేను “అమ్మా! నేనీనీచులను ఘృణాదృష్టితో జూచుచూఉన్నాను. వారిచేతలు నీకు చెప్పుచో నీవాశ్చర్యపడుదువు. వారే నామీద దోషమువేయుచున్నారు. నన్నుగురించి ఎవరు ఏదిఅన్ననూసరే నాకర్తవ్యమును నేను నెరవేర్చెదను. అంటరానివారికి సేవజేసి నన్నుధన్యుణ్నిగా భావించుకుంటాను” అన్నాను.

నామాటలవల్ల నాతల్లికి దుఃఖముగలిగింది. కాని యీవిషయంలో నేను ఎవరిమాటయు వినదలచుకొనలేదు. రూపయొక్క పవిత్రమూర్తి ఎల్లప్పుడూ నాకన్నులఎదుటనే ఆడుచూ, నామనస్సుఉత్సాహముచే నిండింపజేస్తుంది. చిరునవ్వునవ్వు ఆమనోహరప్రతిమ ఎల్లప్పుడూ నాహృదయంలోనేయుంటుంది.

నేనామెను అంటరానిదని యనుకొననేయనుకొనను. ఆమెసాక్షాత్ దేవీమూర్తి...కొన్నిరోజులు విడువకుండా మందువాడినందున హింగూకు జబ్బునయమైంది. మరల వాడు తనపనినిచేసుకొనగలస్థితిలోకి వచ్చాడు. దినమంతయూకష్టపడి పొట్టనింపుకుంటున్నాడు. అయిననూ వాడు నాఋణమును తీర్చవలయునని యే పట్టుదలతోఉన్నాడు. కొన్నిదినములతర్వాత ఒకరోజున రూప రెండురూపాయీలుతెచ్చి నా చేతిలోపెట్టింది. “ఈరూపాయీలెక్కడివి?”అన్నాను. “బాబుగారూ! తమరు నాతండ్రి జబ్బుకు చాలా డబ్బు కర్చుచేశారు. అవేయివి. నెమ్మదినెమ్మదిగా ఇంకా తీర్చుకుంటాను”అంది.

నేను రూప యొక్కచేతిని నాజీవితంలో మొదటిపర్యాయము ఇప్పుడేపట్టుకున్నాను. “రూపా! నీవునన్ను ఇతరునిగా భావించుచున్నావు. అందువల్లనే ఆరూపాయీల యుద్దేశ్యము ఇంకా నీమనస్సులో ఉంది. చూడు! ఇక ఎప్పుడూ రూపాయీలమాట ఎత్తవలదు. లేనిచో నాకు చాలాదుఃఖము గలుగుతుంది. పో! ఈరూపాయీలతో గుడ్డలుకొనుక్కో, చినిగినగుడ్డలు కట్టుకునియున్నావు”అన్నాను.

రూప నావంక ప్రేమ, కృతజ్ఞతాపూరితదృష్టులతో జూచింది. ముత్యమును ధిక్కరించు ఒకసుంద్రని కన్నీటిబిందువు ఆమె నునుచెక్కిలిపైబడి దొల్లిపోయింది. “ఈమె హృదయంలోగూడా ప్రేమసామ్రాజ్య మున్నదా?”

*　　　　*　　　　*　　　　*

నాలుగునెలల తర్వాతనే పట్నములో కలరాప్రవేశించింది. అది త్వరగా పట్నమంతటా వ్యాపిస్తూ ఉంది. ప్రజలు పట్నాన్నివదలి పోతూయున్నారు. చాలామంది వూరిబయట తోటల్లోఉంటున్నారు. కొంతమంది భార్యపిల్లలను యితరగ్రామములు పంపివేశి వారుస్వయంగా మరొకగ్రామమునకు వెళ్ళియుంటున్నారు. ఇంతవరకూ మాచుట్టుపట్లఇండ్లలోమాత్రము కలరాలేదు. అందువల్లమేము కొంతవరకు నిశ్చింతగానేయున్నాము. ఒకరోజుఉదయము మాప్రక్కయింట్లోనే కలరాప్రవేశించింది. ఇండ్లలో గోలెక్కువయింది. ఒకడు “ఇక ఇక్కడయుండటం బుద్ధిమంతుల లక్షణంగా”దన్నాడు. రెండవవాడు “సేశే నేను

రెండవపూటికి వెళ్ళిపోతా"నన్నాడు. ఇద్దరు వయోవృద్ధులు "పారిపోయినందువల్ల మృత్యువుదప్పునా? చావ వలసియుంటే ఎక్కడైనాతప్పదు"అన్నారు. నాతల్లి "జ్ఞానూ! మూడూ ఒకటిరెండురోజులుజూచి కాశీవెళ్ళే ప్రయత్నంచెయ్యి. ఇక ఇక్కడుండుటము మంచిదికా"దన్నది.

నేను మంచిదని తల్లిని శాంతపరిచాను. ఆరోజునే రూప మాయింటికొచ్చింది. నే నామె నడిగాను "రూపా! నీవెక్కడకు వెళ్ళుదువు? అమ్మ కాశీవెళ్ళాలంటోంది."

రూప మలినవదనయై "బాబుగారూ! తమరువెళ్ళండి. నేబీదదానను. ఎక్కడకువెళ్ళగలను?"అంది.

నేను:—ఎవరితోనైనా వెళ్ళరాదా!

రూప:—బాబూ! అంటరానిదానిని నెవరువెంటనుండ నిచ్చెదరు? నాకు బంధువులూలేరూ.

నేను క్రిందికి జూచుచూ "నావెంటవచ్చెదవా?"అన్నాను.

రూపయొక్క సుందరముఖము హర్షమువల్ల వికసించింది. కాని "నేను రాన"ంది. నేను చకితుడనై "ఎందువల్ల? "అన్నాను.రూప గద్గదకంఠముతో "తమకు యిప్పటి యీఅపకీర్తిచాలదా? మిమ్మలను ఇంకా ఎక్కువ అపకీర్తి పాలుజేసెదనా? చావాలసియుంటే ఇక్కడే మీపేరు జపముచేసుకుంటూ చచ్చిపోయెదను. కాని నేను రాజాల"అంది.

నే ననేకవిధముల చెప్పాను. కోప్పడ్డానుగూడాను. కాని ఆమెనోటినుండి రానని తప్ప మరేమియు జవాబులేదు. ఆఖరుకు కోపముతో నేను "అయితే నేనుగూడా పో"నన్నాను. ఈమాటవినుటతోనే రూప వ్యాకులహృదయంతో ప్రార్థింపసాగింది. ఆఖరుకు నే నామెమాట ఒప్పుకోవలసివచ్చింది. కాని నేనొకషరతుపెట్టాను. ఆమెకు ఏవిధమైన కష్టమొచ్చిననూసరే నాకు త్తరమువ్రాయాలని.

మాయింటిచుట్టూయున్న ఇండ్లన్నియూ ఖాళీఅవుతున్నవి. నేనుగూడా వెళ్ళడానికి ఏర్పాటంతా జేశాను. కాని నాఅదృష్టము మరొకవిధంగాఉంది. సాయంత్రంబండికి వెళ్ళుదామని నిశ్చయంజేసుకున్నాము. కాని మధ్యాహ్నంనుంచే దౌర్భాగ్యంవల్ల నాతల్లికి విరోచనాలు ప్రారంభించినవి. నాకు భయమేసి డాక్టరును పిలిచాను. ఏమియుపాలుపోక అటునిటు తిరుగసాగాను. నాకు సహాయులెవ్వరూలేరు. మిగిలియున్న ఇరుగు పొరుగువారుగూడా నాతల్లిస్థితిజూచి పారిపోయ్యారు. నాపినతల్లిగూడా వెళ్లిపోయింది. ప్రపంచములో నావాడెవ్వడూలేడని నాకు ఈరోజున తెలిసింది. దుఃఖసమయంలో ఎవనికిఎవడూగాడు. తనవారుగూడా పరాయివారయ్యెదరు. ఏసంబంధీకుడైనా పిలచినచో ఎదోయొకవంక జెప్పి దాటిపోతాడు. ఆఖరుకు హతాశుడనైకూర్చున్నాను. ప్రపంచమంతయూ అంధకారమయంగా గానుపించింది.

కాని ఈ బంధురాంధకారమును బేధించి యొక యుజ్వలకిరణము నానిరాశను ఆశగా పరిణమింప చేయసాగింది. ఆయుజ్వలకిరణమే రూపయొక్క సహానుభూతి. నేనునిస్సహాయస్థితిలోఉన్న సమయంలో ఆనిస్సహాయ అంటరానిబాలికవచ్చి నన్నురక్షించింది. ఆమెవచ్చి "బాబుగారూ! భయపడెదరెందుకు? నేను బ్రతికేయున్నాను. తల్లిగారిసేవ నేనుజేయుదును. అమ్మగారాజ్ఞ తీసుకోండి"అంది.

నేను తల్లినిఅడిగాను.,దుఃఖసమయంలో సహాయముచేయవచ్చినవారిని ఎవరైనావలదంటారా? "జ్ఞానూ! రూపనుపిలువు. మనవారంతా మనలను వదలినప్పుడు ఆమెయేమనమనిషి"అంది. నేను మనస్సులో "ఈశ్వరుడు సర్వశక్తివంతుడు. ఎంతవారలగర్వమునైననూ చూర్ణముచేయుచున్నాడు. రూపయొక్క పాపనుజూచినంతనే పారిపోవునాతల్లి నేడు ఆమెచేతినీరు త్రాగుటకు సిద్ధమయింది.

రూపవచ్చి అమ్మకుశక్తికొలదీ సేవజేయసాగింది. ఆమె విరోచనము శుభ్రముజేస్తుంది. ఆమె గుడ్డలు మార్చికడుతుంది. ఎల్లప్పుడూ, విసరుతూయుంటుంది. రాత్రంతయు మేల్కొని తల్లిమంచమువద్ద నేయుం

టుంది. ఒక్కక్షణంగూడా నిద్రపోదు. మాతల్లి ఆమెతో "బిడ్డా! నీవుదేవివి. నాతప్పుక్షమించు"అంది. రూప "అమ్మా! ఆమాట మరచిపొండి. తమసేవజేయుటయే నాధర్మముగా భావించుకున్నాను"అంది.

మాఅమ్మస్థితి కొంచము బాగుపడ్డది. కాని అప్పుడే నాదుఃఖమునకంతమురాలేదు. మాఅమ్మకు కొంచెము నెమ్మదించడముతోనే కలరా నన్నాక్రమించింది. మాఅమ్మ యింకాయిటునటు తిరుగజాలకుండానే యుంది. అందువల్ల నాభారంగూడా రూపపైననేపడ్డది. ఆమె నన్ను తనప్రాణంగా జూచుకుంటుంది. డాక్టరు రోజుకు మూడుమార్లువచ్చి పోతూయుంటాడు. మందు తేవటం, ఇవ్వటం, ఏర్పాటంత హీంగూచూస్తూన్నాడు. పాపము వాడురోజంతయూ యింటిముంగిలిలోనే కూర్చుంటాడు. పిలుచుటయేతడవు, పరుగెత్తుకొస్తాడు. ఒకరోజు మాఅమ్మఏడ్వటంజూచి "అమ్మగారూ! తమరెందుకు ఏడ్చెదరు? బాబు మాకుజేసిన యుపకారము నకు మేము ప్రాణమిచ్చియైననూ తీర్చుకొనలేము"అన్నాడు.

మాతల్లి "సోదరా! నాకీప్రపంచములో మీకంటెదిక్కెవ్వరూలేరు"అంది. రాత్రికి నాస్థితి మరీకష్టంగా ఉంది. నేను రూపను తలనొప్పికూర్చోమన్నాను. ఆమె నాపరిస్థితినిజూచి నాఆజ్ఞను నెరవేర్చింది. నేను కన్నులు తెరచి ఆమెవంక యొకపర్యాయము జూచాను. నాకళ్ళనిండా నీరునిండింది. రూప నాకండ్లు తుడుచుచూ "బాబుగారూ! ఎందుకింత భయపడెదరు? జబ్బు తెల్లవారుసరికి బాగవుతుంది"అంది.

నేను:—రూపా! నీవుచేసిన యీసేవయొక్క ఋణము తీర్చుకొనలేను. ఇందువల్లనే యింతదుఃఖము.

రూప "బాబుగారూ! ఆవిచారము మనస్సులో పెట్టుకొనవలదు. లేనిచో ఆరోగ్యము చెడిపోవును" అంది. నేను కన్నులుమూసుకున్నాను. రూపనాతలనువత్తుతోంది. నేను నిద్రపొయ్యాను. నేనెంతవరకు నిద్ర పొయ్యానో తెలియదు. కాని మెల్కొనినప్పుడు రూప మొదటనేను చూచినవిధముగానే కూర్చునియుంది. ఆమె ఒకచెయ్యి నాతలమీదనేయుంది. ఒకచేతితో విసరుతుంది. నాహృదయం చాలాశాంతంగాఉంది. డాక్టరుగారువచ్చిచూచి సంతోషించారు. రెండురోజులలో అటుఇటుతిరగసాగాను. మూడవరోజున మేమంతా వెళ్ళిపోదామనుకుంటున్నాము. ఇంతలో రూపకు వమనమయింది. నేను చాలాభయపడి పొయ్యాను. డాక్టరునుపిలిచి మందు లిప్పించాను. కాని వమనానికి, విరోచనానికి అంతములేదు.

డాక్టరుగారిముఖములోగూడా కళలేదు. రాత్రికి రూప తెలివిదప్పి పడిపోయింది. నేనామెతలను యొడిలోఉంచుకుని కూర్చున్నాను. నాకళ్ళనుండి మాటిమాటికి అశ్రువులుధారగా ప్రవహించుచున్నవి. మాతల్లిగూడా ఏడుస్తూయుంది. పాపము హీంగూనిశ్శబ్దంగాకూర్చున్నాడు. మాతల్లి ఏడ్వటంజూచి "అమ్మ గారూ! ఏడ్చినందువల్లలాభమేముంది? రూప తనఋణము, నాఋణము తీర్చివేసింది. నాకు కొంచెముగూడా దుఃఖములేదు. నాశరీరముగూడా బాబుగారికి అక్కరకువస్తే అదేసంతోషము."అన్నాడు.

ఈమాటచెప్పి వాడు వెళ్లిపొయ్యాడు. అమ్మగూడా పైకివెళ్ళిఏడుస్తూయుంది. కొంచెము సేపటికి రూప కన్నులుతెరచి "బాబుగారూ! నేను వెళ్ళుచున్నాను. నన్నుమరువవద్దు."అంది.

నాకళ్ళనుండి ఏకధారగానీళ్ళు ప్రవహించుచున్నవి. నేను అతికష్టముమీద "నారూపా!"అన్నాను. ఇంతకంటే అధికంగాచెప్పలేకపొయ్యాను. నాకు దుఃఖముపొంగిపొరలివస్తుంది. నాముఖమును ఆమెముఖముపై ఆనించి "నారూపా!"అన్నాను. రూప క్షీణస్వరముతో "నాబాబూ!"అని కళ్ళుమూసింది.

* * * *

ప్రపంచమంతయూ అంధకారబంధురమైంది. అదేస్థితిలో రూపామృతశరీరముపై చెయివైచి జీవన పర్యంతమూ అవివాహితుడుగా ఉండుటకునూ, అస్పృశ్యతానివారణకై నాశరీరమును అర్పణచేయుటకును శపథంచేశాను.

—అనువాదము.